క్లుప్తంగా

యువత బాధ్యతతో పనిచేయాలి



మాట్లాడుతున్న చిన్మయామిషన్ కార్యదర్శి స్వామి తురియానంద

వైవీయూ: ఉత్తిష్ఠ భారత్ సాకారం కోసం యువత బాధ్యతతో లక్ష్యంవైపు పనిచేయాలని చిన్మయా మిషన్ కార్యదర్శి స్వామి తురియానంద పేర్కొన్నారు. గురువారం కడప నగరం పక్కీరుపల్లెరోడ్డులోని శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో «ఉత్తిష్ఠ భారత్»పై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి తురియానంద మాట్లాడుతూ భారతదేశ బలం యువత అని, యువత శక్తిసామర్థ్యాలను దేశప్రగతి, సమాజ ప్రగతికి వినియోగించాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ డి.ఎస్.ఆర్. మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.పి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ యువత శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలన్నారు. చదువుతో పాటు క్రీడలు, కళల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

సరుకులు అందజేత

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని ఎర్రముక్కపల్లె సర్కిల్ దగ్గర ఉన్న నవజీవన్ నిరాశ్రయుల వసతి గృహానికి గురువారం మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ నిత్యావసర సరుకులను అందచేశారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ నిరాశ్రయుల వసతి గృహం నిర్వాహకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ మార్చురీలో వృద్ధుడి మృతదేహం



కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో డిసెంబర్ 21న బృందా వృద్ధాశ్రమం నుంచి రామచంద్రుడు (90) అనే వృద్ధుడు అనారోగ్యంతో చేరారు. ఆయన చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. అతని ఆచూకీ తెలిసిన వారు ఉంటే తమను సంప్రదించాలని రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు.

వేతనాలు జమ

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న (అకడమిక్ కన్సల్టెంట్) అధ్యాపకులకు రెండు నెలల వేతనాన్ని వారి ఖాతాల్లో విశ్వవిద్యాలయ అధికారులు గురువారం జమ చేశారు. ఈనెల 1 వ తేదీన «అధ్యాపకులు.. వేతన వెతలు» అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి వారికి జమ చేయాల్సిన వేతనాలను వారి ఖాతాల్లో జమ చేశారు. దీంతో వైవీయూ అకడమిక్ కన్సల్టెంట్లు విశ్వవిద్యాలయ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

విలువలు పెరిగితేనే ఉత్తమ సమాజం

కడప కల్చరల్ : మానవతా విలువలు పెరిగినపుడే మంచి సమాజం ఏర్పడగలదని మానవత సంస్థ సెంట్రల్ కమిటీ డైరెక్టర్ ,జిల్లా కెరీర్ గైడెన్స్ చైర్మన్ రాటాల గోపి అన్నారు. గురువారం కడప నగరంలోని సాయిపేటలోగల ఎస్‌వీఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నైతిక విలువలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువల ఆధారంగా నడుచుకున్న వారు మాత్రమే సమాజంలో సరైన దిశలో పయనిస్తారని, అది సమాజానికి ఉన్నత స్థితిని తీసుకొస్తుందని, టీనేజ్ లో ఉన్న పిల్లలు ఇప్పటి నుంచే ఆ ప్రవర్తన అలవర్చుకోవాలని సూచించారు. కడప నగర జాయింట్ సెక్రటరీ సుబ్బయ్య, సాయి విజ్ఞాన్ హైస్కూల్ డైరెక్టర్ భూపతి రాయల్, కళాశాల కరెస్పాండెంట్ , ప్రిన్సిపాల్ సుధాకర్ మాట్లాడారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు



బస్తా బరువును పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సురేష్ కుమార్ రెడ్డి

కడప అగ్రికల్చర్: ఎరువులను డీలర్లు ఎమ్మార్పీ ధరలకంటే అధికంగా అమ్మితే కఠిన చర్యలతో పాటు లైసెన్సులు రద్దు చేస్తామని ఏడీఏ నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని పలు ఎరువుల దుకాణాలను కడప ఏఓ సురేష్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రిజిస్టర్లు, బిల్లు బుక్స్‌ను నిర్వహిస్తున్నారా లేదా అని పరిశీలించారు. అన్ని ఎరువులకు అనుమతులు ఉన్నాయా లేదా అని ఆరా తీయడంతో పాటు స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. అలాగే ఎరువుల సంచులను తూకం వేసి 50 కిలోలు ఉన్నాయా లేదా అని కూడా పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు ఎరువులను కొనుగోలు చేసేటప్పుడు ఖచ్చితంగా బిల్లులు తీసుకోవాలన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణ మూర్తులుగా స్వామి, అమ్మవార్లు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించి అర్చకులు స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో మహా మంగళ సూత్రాలను అలంకరించారు. ఈ సందర్భంగా ఉభ య దారులతో పూజలు నిర్వహింపజేసి వారితోపా టు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సాంకేతిక సహకారం ..

ఇటీవల కడప రాయుని సన్నిధిలో నిత్యాన్నదానం నిర్వహిస్తున్న విషయం భక్తులకు తెలిసిందే. ఈ కార్యక్రమం పలువురిని విశేషంగా ఆకట్టుకుంటూ ఉండడంతో పలువురు దాతలు కార్యక్రమంలో తమవంతుగా దాతృత్వాన్ని చాటుకునేందుకు ముందుకు వస్తున్నారు. దీన్ని ఇటీవల పర్యటనలో గమనించిన టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చారు. దీన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు వారు ఎస్‌బీఐ అధికారుల సహకారంతో దేవునికడప ఆలయంలో గురువారం ఆ సదుపాయం గురించి డెమో నిర్వహించారు. ఇందులోని క్యూఆర్ కోడ్‌లో రూపాయి నుంచి రూ. లక్ష వరకు పంపే అవకాశం ఉందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ, ఎస్‌బీఐ అధికారులు శ్రీవా ణి, కిశోర్‌కుమార్‌రెడ్డి, డీజీఎం వెంకటేశ్వర్లు, బ్రాంచ్ మేనేజర్ శిరీష, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకులకు సత్కారం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన పలువురు సమాజ సేవకులను శాంతి సేవా సొసైటీ ప్రతినిధులు సత్కరించారు. గురువారం సంస్థ కార్యాలయంలో వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సామాజిక సేవకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మద్దూరి మోహన్, మనోహర్, విజయ్ కుమార్, రాజారత్నం పాల్గొన్నారు.

10న ఆందోళన



పేదల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు, రెండు ఎకరాల సాగు భూమి మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా ఈనెల 10న తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించనున్న ఆందోళన జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. గురువారం నగరంలోని శాంతినగర్ లో అర్జీదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. పేదలకు ఇంటి స్థలం ఇవ్వడానికి నిరాకరిస్తున్న అధికారులు తమ కళ్ళముందే విలువైన ప్రభుత్వ వంక వాగో, చెరువు రాస్తా, అసైన్డ్, దేవాదాయ, ఈనామ్ , వక్ఫ్ భూములు చివరకు స్మశానాలు కూడా వదలకుండా ఆక్రమించి అమ్ముకునే డీకేటి మాఫియా కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వెంకట శివ, జోన్ కార్యదర్శి శంకర్ నాయక్, బ్రహ్మం, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకుడు

కడప ఎడ్యుకేషన్: అన్ని దానాలకన్నా రక్తదానం మిన్న అని జెకె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్‌బాషా పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని 27వ డివిజన్ గౌస్‌నగర్‌లో సెలూన్‌షాపు అధినేత షేక్ సద్దాం, బృహత బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాయల్ కరిముల్లా, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ ఎంతో ఉపయోగం



విద్యార్థికి మెటీరియల్‌ను అంద చేస్తున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ), రాష్ట్ర అకడమిక్ కమిటీ రూపొందించిన పదవ తరగతి స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగం అని కడప ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కడప నగర పాలక ఉన్నత పాఠశాల మెయిన్‌లో ఎస్‌టీయూ రూపొందించిన పదవ తరగతి మెటీరియల్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ మెటీరియల్ ఉపయోగించుకొని మంచి మార్కులు తెచ్చుకోవాలని కోరారు. పాఠశాల హెచ్ఎం నాగమణి మాట్లాడుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం మెటీరియల్ రూపొందించడం అభినందనీయం అన్నారు. ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, ఎస్‌టీయూ రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ రవి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులందరికీ ఉచితంగా మెటీరియల్ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా నాయకులు మహబూబ్ బాషా, అబ్దుల్ వాజీద్, దామోదర్, అబ్దుల్ సత్తార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి నియమాలతో ప్రమాదాలకు చెక్



రహదారి భద్రతపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్ తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రమాదాలకు చెక్ పెట్టాలని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పైడి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం కడప కేంద్రియ విద్యాలయ స్కూల్ చిల్డ్రన్ పేరెంట్స్ అసోసియేషన్ ట్రెజరర్ జితేంద్ర, కమిటీ సభ్యులు సి.విశ్వనాథ్‌లు ట్రాఫిక్ సూచనలపై ఈడీ చేతులమీదుగా పోస్టర్లను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకొని పిల్లలకు ట్రాఫిక్ నియమ నిబంధనల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. పేరెంట్స్ అసోసియేషన్ ట్రాఫిక్ నియమాలపై పోస్టర్ రూపొందించడం అభినందనీయమన్నారు. సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారులను సంప్రదించి బస్సులు సకాలంలో తిరిగేందుకు బాధ్యత తీసుకోవాలన్నారు. కేంద్రియ విద్యాలయకు బస్ పాసులతో కూడిన ఆరు బస్సుల సౌకర్యం కల్పిస్తున్నందుకు, అన్నివిధాల సహకరిస్తున్నందుకు పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు రీజనల్ ఎస్టేట్స్‌మెంట్ ఇన్‌ఛార్జి అధికారిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ స్థాయికి జిల్లా వారసత్వ సంపద ఘనత



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి

కడప కల్చరల్ : గండికోట లాంటి ఘనమైన వారసత్వ సంపద విశిష్టతను జాతీయ స్థాయికి తీసుకెళ్లి విస్తృత ప్రచారం చేస్తున్న ఇంటాక్ కడప చాప్టర్ కృషి ప్రశంసనీయమైనదని వైవీయూ ఉప కులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఇంటాక్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, పోతుల చిన్న కంచమ్మ, చిన్న ఓబుళరెడ్డి, సరస్వతమ్మ స్మారక ట్రస్టుల ఉమ్మడి ఆధ్వర్యంలో నగరానికి చెందిన మానస ఇన్ సమావేశ మందిరంలో ఇంటాక్ వార్షిక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ త్వరలో ఇంటాక్ జిల్లా చాప్టర్‌కు జాతీయ స్థాయిలో బాధ్యతలు లభించే అవకాశం ఉందన్నారు. జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి వార్షిక నివేదిక సమర్పించారు. వైవీయూ తెలుగు విభాగం ఆచార్యులు ఎన్. ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుభాష ఉన్నతిని, సంస్కృతిని నేటి తరానికి చాటేందుకు ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించాలని సూచించారు. చాంద్‌బీ మెమోరియల్ ట్రస్టు కార్యదర్శి లయన్ మన్సూర్ అలీఖాన్, సంస్థ కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ సంస్థ అధ్యక్షులు అనంతంబొట్ల వెంకట సుబ్బయ్య, పూర్వ అధ్యక్షులు లయన్ పోతుల వెంకట్రామిరెడ్డి, సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలి



సైన్సు ఫెయిర్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: కడప నగరం మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో శుక్రవారం నిర్వహించనున్న జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎబినైజర్ ఇమ్మానుయేల్, కడప ఎంఈఓ గంగిరెడ్డిల ఆధ్వర్యంలో సైన్సు ఫెయిర్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు సమిష్టి కృషితో జిల్లా సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని సూచించారు. జిల్లాలోని 36 మండలాల నుండి వ్యక్తిగత విభాగంలో 36, గ్రూపు విభాగంలో 36, ఉపాధ్యాయ విభాగంలో 36 చొప్పున సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శనకు కడపకు వస్తాయని పేర్కొన్నారు. ఇందులో జ్యూరీ సభ్యులు ప్రాజెక్టులను పరిశీలించి ప్రతి విభాగం నుంచి రెండు ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయాలని పేర్కొన్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, ఉపాధ్యాయుల పర్యవేక్షణ, విద్యార్థుల సందర్శన వంటి కార్యక్రమాలను కమిటీ సభ్యులు జాగ్రత్తగా పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హైస్కూల్ మెయిన్ హెచ్ఎం నాగమణి, కమిటీ సభ్యులు దశరథరామిరెడ్డి, కేశవరెడ్డి, నిత్యానంద రెడ్డి, గంగాధర్, కృష్ణ కిషోర్, విజయ ప్రసాద్, బాలకృష్ణ, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4న డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకులు మోపూరి శివారెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులను దుర్భాషలాడుతూ, మానసిక క్షోభకు గురి చేస్తున్న డీఈఓ మాకొద్దని ఈనెల 4వ తేదీన డీఈఓ ఆఫీస్ ఎదురుగా ధర్నా నిర్వహిస్తున్నామని వైఎస్సార్ జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. గురువారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు వైఎస్సార్ జిల్లా ఉపాధ్యాయ భవన్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ కడప జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు తీసుకున్న మీనాక్షి పాఠశాలలు సందర్శించినప్పుడు అక్కడి మండల విద్యాశాఖ అధికారులను, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను దుర్భాషలాడుతూ, మానసిక క్షోభ కు గురిచేస్తున్నారన్నారు. దీంతోపాటు వారిని బానిసలకంటే హీనంగా చూస్తోందని ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు అన్నారు. ఇటువంటి డీఈవో కడప జిల్లాకు ఉండకూడదని ఈనెల 4న డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు అందరూ అత్యధిక సంఖ్యలో ధర్నాకు హాజరు కావాలని కోరారు.

ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘాలు ఎస్టీయూ, యూటీఎఫ్, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్ 257, ఏపీటీఎఫ్ 1938, పీఎస్టీయూ నాయకులు, ఆర్‌యూపీపీ, స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ నాయకులు, ఏపీసీ అసోసియేషన్, ఆర్జేయూపీ, హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ, ఎస్టీఎఫ్, ఎస్ఆర్ టీఎఫ్, ఎన్‌టీఏ, ఎస్ఎల్‌టీఏ, సీపీఎస్ అసోసియేషన్, వైఎస్సార్ టీచర్ అసోసియేషన్, బహుజన టీచర్స్ అసోసియేషన్, ఐటా అసోసియేషన్, పీఈటీ అసోసియేషన్స్ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



రిమ్స్‌లో 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అడ్మినిస్ట్రేటర్ రంగస్వామి



డీవైఎఫ్ఐ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు ఓబుల్ రెడ్డి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

కడప అర్బన్: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ సభ్యులు రిమ్స్ ఆసుపత్రిలో గురువారం అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం రిమ్స్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ రంగస్వామి చేతుల మీదుగా నూతన సంవత్సరం -2025 క్యాలెండర్‌ను ఆవిష్కరింపచేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు పి. అమరావతి, కార్యదర్శి పి. లిల్లీ ఫ్లారెన్స్, కోశాధికారి పెరిసిస్, ఉపాధ్యక్షురాలు ఎస్. పద్మావతి, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి. పద్మలత, జిల్లా కార్యవర్గ సభ్యులు రామరంజిత, ఆశాజ్యోతి, షర్మిల, శారదా, పంకజం తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ క్యాలెండర్ ఆవిష్కరణ

కడప వైఎస్ఆర్ సర్కిల్: డీవైఎఫ్ఐ నూతన సంవత్సర క్యాలెండర్ ను ప్రముఖ వైద్యులు, శ్రీ హస్పిటల్ అధినేత డాక్టర్.ఓబుల్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నగర కార్యదర్శి శివరాం, జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు, నగర కార్యదర్శి విజయ్, నగర నాయకులు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపస్ ఆధ్వర్యంలో...

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రూపొందించిన క్యాలెండర్ జాతీయ భావాలను పెంపొందించేలా ఉందని పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆపస్ 2025 సంవత్సరపు క్యాలెండర్, డైరీని పులివెందుల్లో ఆపస్ ప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఆపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి. చెన్నయ్య, కొండారెడ్డి , ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని మిలటరీ హాస్పిటల్‌లో మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్, డైరీ, హెల్త్‌రికార్డ్ బుక్స్‌ను ఆవిష్కరించారు. గురువారం జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి. లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో మిలటరీ హాస్పిటల్ డాక్టర్ కల్నల్ మ్యాతివు చేతుల మీదుగా వాటిని ఆవిష్కరించారు. అనంతరం కడప నగరంలోని నాగరాజుపేట నగరపాలక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రతినిధులు గోపాల్ రెడ్డి, బీఎస్. సింగ్, శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడాపోటీలకు జిల్లా క్రీడాకారిణులు



శ్రీవాణి



సుహాసిని

కడప స్పోర్ట్స్: ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు న్యూఢిల్లీలోని త్యాగరాజ్ స్టేడియంలో నిర్వహించనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడాపోటీలకు కడపకు చెందిన ఇద్దరు క్రీడాకారిణులు ఎంపికయ్యారు. కబడ్డీ మహిళల విభాగం నుంచి టి. శ్రీవాణి (సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి), బి. సుహాసిని (ఫిజికల్ డైరెక్టర్) ఏపీ జట్టుకు వీరు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు చక్కటి ప్రదర్శన కనబరచడంతో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు వీరిని ఎంపిక చేశారు.

ఘన సన్మానం



విద్యాసాగర్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్ : ఏపీ ఎన్జీఓ సంఘం రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎ.విద్యాసాగర్‌ను ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డీఎస్ కొండయ్య, ఇతర కార్యవర్గ సభ్యులు గురువారం ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా ఉద్యోగుల సమస్యలను ఏ నాయకుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లలేదని ఈ సందర్భంగా కొండయ్య అన్నారు. అయితే విద్యాసాగర్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వెంటనే ముఖ్యమంత్రిని కలిసి సమస్యలను వివరించడం సంతోషదాయకమన్నారు.

ఘన నివాళి



షఫీవుల్లా మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : విధి నిర్వహణలో మరణించిన వక్ఫ్‌బోర్డు అధికారి షేక్ మహమ్మద్ షఫీవుల్లా కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. గురువారం కడప రవీంద్రనగర్‌లో షఫీవుల్లా మృతదేహాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. వక్ఫ్‌బోర్డు తరుపున రూ. లక్ష ఎక్స్‌గ్రేషియా చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. షఫీవుల్లా కుటుంబ సభ్యులు కోరితే ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. షఫీవుల్లా వక్ఫ్‌బోర్డులో సుదీర్ఘకాలం సేవలు అందించారని చెప్పారు. విధి నిర్వహణలో ఉండగానే గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తీసుకు వెళుతుంటే ఆయన మరణించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు అమీర్‌బాబు, వక్ఫ్‌బోర్డు సభ్యులు దావుద్‌బాష బాఖవి, సీఈఓ అబ్దుల్ ఖాదిర్, జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ గౌస్, జాఫర్ షరీఫ్, రియాజ్, అన్వర్, మైజుల్లా హుసేనీ, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్

కడప వైఎస్ఆర్ సర్కిల్: సీపీఎం కడప జిల్లా 12 వ మహాసభలు జనవరి 4, 5 తేదీల్లో కడప నగరంలో జరుగనున్నాయని, ఈ మహాసభల విజయవంతానికి నగర ప్రజానీకం సహకరించాలని ఆ పార్టీ నగర కార్యదర్శి రామమోహన్ విజ్ఞప్తి చేశారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభల సందర్భంగా ఈ నెల 4వ తేదీ ఉదయం 10 గంటలకు కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఉన్న జియాన్ కాలేజీ నుండి ప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ప్రదర్శన కోటిరెడ్డి సర్కిల్, సంధ్య సర్కిల్, రైతు బజార్ మీదుగా ఐటిఐ సర్కిల్ వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం ఐటిఐ సర్కిల్ వద్ద బహిరంగ సభ జరుగుతుందన్నారు. అనంతరం బిల్డప్ వద్ద వున్న అజ్మత్ ఫంక్షన్ హాల్ లో మధ్యాహ్నం మూడు గంటల నుండి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, శివకుమార్, చిన్ని పాల్గొన్నారు.

రిమ్స్‌లో వేడుకలు

కడప అర్బన్: కడప నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో గురువారం 2025 నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని అడ్మినిస్ట్రేటర్ విభాగంలో వైద్య సిబ్బంది, నర్సుల ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి ఒకరినొకరు తినిపించుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రమాదేవి, అడ్మినిస్ట్రేటర్ రంగస్వామి, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, డిడి శ్రీనివాసరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ మాధురీలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.